సాక్షి
తిరుపతి
బుధవారం ı 25 ı డిసెంబర్ ı 2024

ఏసు సందేశం.. ప్రేమకు సంకేతం


తిరుపతిలో ముస్తాబైన ఈస్ట్ చర్చి

క్రిస్మస్ ట్రీలు.. మిరిమిట్లు గొలిపే భువి నక్షత్రాలు.. శ్వేత వర్ణపు గడ్డంతో శాంటాక్లాస్‌లు.. విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందుతున్న క్రిస్టియన్ చర్చిలు.. జిల్లాలో ఇప్పుడు ఎక్కడ చూసినా ఇవే దృశ్యాలు కనిపిస్తున్నాయి. మేరీ క్రిస్మస్‌ను పురస్కరించుకుని మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. దైవకుమారుడు ఏసుక్రీస్తు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమయ్యాయి. క్రైస్తవులు తమ ఇళ్లల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసి క్రీస్తు జన్మదినాన్ని ఆహ్వానించే విధంగా తీర్చిదిద్దారు. పిల్లలు, పెద్దలు శాంటాక్లాస్ వేషధారణతో విశేషంగా ఆకట్టుకున్నారు. బుధవారం విందు భోజనాలు ఆరగించి.. ప్రార్థనల్లో లీనం కానున్నారు. - తిరుపతి, కల్చరల్

న్యూస్‌రీల్

పక్షుల పండుగకు పకడ్బందీ ఏర్పాట్లు


ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు

దొరవారిసత్రం/సూళ్లూరుపేట : సూళ్లూరుపేట కేంద్రంగా జనవరి 10, 11, 12 తేదీల్లో నిర్వహించనున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌కు నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో సందర్శకుల సౌకర్యార్థం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు డీఎఫ్‌ఓ హారిక, ఆర్డీఓ కిరణ్మయి, డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పక్షుల కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలోని వసతులు, సదుపాయలపై అధికారులతో చర్చించారు. చేపట్టాల్సిన చర్యలపై ఆయాశాఖల అధికారులతో మాట్లాడారు. తర్వాత సూళ్లూరుపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. వీరి వెంట తహసీల్దార్ శైలకుమారి, నరసింహారావు, రేంజర్ ఆఫీసర్ సౌజన్య, ఎఫ్ఎస్‌ఓ బాలయ్య ఉన్నారు.

ఎస్వీయూలో లా సెట్ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో రెండేళ్ల ఎల్‌ఎల్‌ఎమ్, ఐదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కోసం ఏపీ లాసెట్ - 2024 లో అర్హత సాధించి, ఆసక్తిగల విద్యార్థులు లా సెట్ ర్యాంక్ కార్డ్‌తో పాటు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈనెల 26వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్‌లో హాజరుకావాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశం పొందిన వారికి ఫీజురీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉండదని ఆయన స్పష్టం చేశారు.

ఆరోగ్యశాఖ కీలకం


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న డీఎంహెచ్‌ఓ

తిరుపతి అర్బన్: ఆరోగ్యశాఖ ఎంతో కీలకమని, సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బాలకృష్ణనాయక్ నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముందే జ్వరాల సీజన్, ఈ క్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేయడంతోపాటు గ్రామీణులందరికీ వైద్య బృందం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.


తిరుపతిలో క్రిస్మస్‌కు ప్రార్థనా మందిరాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్న క్రిస్టియన్లు

ప్రేమ, కరుణ నిండాలి


వెంకటేశ్వర్, కలెక్టర్ సుబ్బరాయుడు, ఎస్పీ శుభం బన్సల్, జేసీ

తిరుపతి అర్బన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాత్రి వారు ప్రకటన విడుదల చేశారు. క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవాలని కోరారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో తులతూగాలని ఆకాంక్షించారు. ప్రభువు దీవెనలు వెళ్లవేళలా ఉండాలని పేర్కొన్నారు.

సోలార్ చీకట్లు!


రూఫ్ టాప్‌పై ఏర్పాటుచేసిన సోలార్ ప్యానల్స్



సూర్యఘర్ పథకానికి నిర్లక్ష్యపు నీడ

- అవగాహన లేమి, బ్యాంకర్ల సహాయ నిరాకరణ
- అమలులో చతికిలపడిన ఎస్పీడీసీఎల్
- జిల్లాలో 1,562 దరఖాస్తులకుగాను 221 సోలార్ ప్యానల్స్ ఏర్పాటు
- జనవరి నుంచి ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల రిజిస్ట్రేషన్

ప్రధాన మంత్రి సూర్యఘర్‌ముఫ్త్ బిజిలీ యోజన(పీఎంఎస్‌ఎంవై) పథకం అమలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ పథకం వచ్చి 10 నెలలు దాటుతున్నా నామమాత్రంగానే రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్లను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాకు ఇచ్చిన లక్ష్యంలో కనీసం 14 శాతం కూడా అధిగమించలేకపోతున్నారు. దీనివల్ల కలిగే ప్రయోజనాలను వివరించడంలో డిస్కం అధికారులు విఫలమవుతున్నారు. కేవలం కరపత్రాల పంపిణీకే పరిమితం కావడం.. బ్యాంకుల సహకారం లేకపోవడం కూడా ఇందుకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. దీంతో ప్రతి ఇల్లూ ఒక సౌర విద్యుత్ ఉత్పాదక యూనిట్ కావాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వ ఆశయం నీరుగారి పోతోంది.

తిరుపతి రూరల్: విద్యుత్ బిల్లులు పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు పెనుభారంగా మారుతోంది. ట్రూ అప్ చార్జీల పేరుతో మోపుతున్న భారంతో కరెంటు బిల్లులు ప్రతి నెలా షాకిస్తున్నాయి. దీని వల్ల ఆయా కుటుంబాలు ఆర్థికంగా చికితికి పోతున్నాయి. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం రాయితీతో తమ సొంత ఇంటిపై 'సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోండి....విద్యుత్ బిల్లు తగ్గించుకోండి..' నినాదంతో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని అమలుకు శ్రీకారం చుట్టింది. 2024 ఫిబ్రవరి 15న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ పథకాన్ని ప్రారంభించారు. వినియోగదారుడు ప్రతీ నెలా ఖర్చుచేసే విద్యుత్ యూనిట్ల ఆధారంగా రూఫ్ టాప్ సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక కిలోవాట్ (కేడబ్ల్యూ) మొదలుకొని 3 కేడబ్ల్యూ వరకు ఏర్పాటు చేసుకొనే వెసులుబాటు ఉంది.

పది శాతం చెల్లిస్తే చాలు

కిలో వాట్‌కు రూ.60 వేల నుంచి రూ.70 వేలు, రెండు కిలో వాట్లకు రూ.1.3 లక్షల నుంచి రూ.1.5 లక్షల వరకు, మూడు కిలోవాట్లకు రూ.1.5 లక్షల నుంచి రూ.2.4 లక్షల వరకు ఖర్చవుతుంది. రూ.60 వేల నుంచి రూ.2.40 లక్షల వరకు కేడబ్ల్యూ ఆధారంగా ఖర్చవుతుంది. ఇందులో వినియోగదారుడు కేవలం 10 శాతం అంటే రూ.7 వేల నుంచి రూ.24 వేల వరకు భరిస్తే చాలు. మిగిలిన 90 శాతం ఖర్చును బ్యాంకుల నుంచి రుణంగా మంజూరు చేయిస్తుంది. 7 శాతం వడ్డీతో పదేళ్ల కాలపరిమితి వరకు చెల్లించేలా ఈ రుణాలను అందిస్తున్నాయి. రుణాన్ని పొందేందుకు బ్యాంకులకు సెక్యూరిటీ కింద ఎటువంటి డ్యాకుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదు. సొంత ఖర్చుతోగానీ, బ్యాంకు రుణంతో గానీ రూఫ్ టాప్‌పై సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకున్న తర్వాత నెల రోజుల వ్యవధిలోనే కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోంది.

రూ.78 వేల వరకు సబ్సిడీ

ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు అయితే రూ.60 వేలు, రెండుకు పైగా ఎన్ని కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకున్నా కిలోవాట్‌కు రూ.18వేలు చొప్పున సబ్సిడీ అందిస్తోంది. అంటే మూడు కిలోవాట్ల సామర్థ్యం ప్యానల్స్‌కు రూ.78 వేలు సబ్సిడీ వస్తుంది అన్నమాట. నేరుగా వినియోగదారుడి బ్యాంకు ఖాతాకే సబ్సిడీని జమచేస్తోంది. సోలార్ రూఫ్ టాప్ ద్వారా ఉత్పత్తయిన విద్యుత్‌ను గృహావసరాలకు పోను మిగిలిన సౌరవిద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా యూనిట్‌కు రూ.2.09 ఆదాయం పొందవచ్చు.

అవగాహన లేమి.. బ్యాంకర్ల కొర్రీలు

ఈ పథకానికి 90 శాతం రుణాలు ఇవ్వాల్సిన బ్యాంకర్లు చాలా చోట్ల కొర్రీలు పెడుతున్నాయి. రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు రుణాలు ఇవ్వాల్సి ఉండడంతో తాకట్టు కోసం ఆస్తులను అడుగుతున్నారు. రుణం ఇచ్చినా ఇన్సూరెన్స్ తీసుకోవాలని బలవంతం చేస్తున్నారు. తిరుపతిలోని ప్రముఖ బ్యాంకుల్లో ఇలా ఇన్సూరెన్స్ భారం అధికంగా ఉంది. అంతేకాకుండా ముందుగా మొత్తం ఖర్చు వినియోగదారుడే పెట్టుకోవాల్సి ఉండడం, అంతా అయిన తర్వాత సబ్సిడీ వేస్తుండడంతో బ్యాంకులతో పనిలేకుండా సోలార్స్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకోవాలనే వారికి పెనుభారంగా మారింది.

1.45 లక్షల ఎస్సీ, ఎస్టీ వినియోగదారులపై గురి

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యుత్ వినియోగదారులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తోంది. వారికి సౌర విద్యుత్ పథకం అనుసంధానం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. దీనిపై జిల్లాలో ఇప్పటికే సర్వే చేస్తున్నారు. తొలుత కాలనీల్లో నివాసముండే వారికి సౌరఫలకలు ఏర్పాటులో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు. బ్యాంక్‌లోన్‌మొత్తాన్ని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా చెల్లించే విధంగా ప్రణాళికల్లో ఉన్నట్లు ఉద్యోగులు పేర్కొంటున్నారు.

జిల్లాలో 221 కనెక్షన్లు మాత్రమే

సూర్య ఘర్ యోజన పథకం కింద గ్రూప్ హౌసింగ్, సొసైటీలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, వ్యక్తిగత గృహసముదాయాలకు రాయితీపై సోలార్ రూఫ్‌టాఫ్ ప్యానల్స్‌ను ఇన్‌స్టాల్ చేస్తారు. రానున్న మార్చికి జిల్లాలో 6 వేల సర్వీసులు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. అయితే జిల్లాలో డిసెంబర్ 23వ తేదీ వరకు 1,562 మంది ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోగా..అందులో 569 మంది సోలార్ కంపెనీలతో ఒప్పందం చేసుకున్నారు. ఇప్పటి వరకు కేవలం 221 చోట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో కూడా 131కి మాత్రమే కేంద్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ వచ్చింది. రూఫ్‌టాప్ కింద జిల్లాలో 850 కిలో వాట్ల విద్యుత్‌ను సోలార్ ప్యానల్స్ ద్వారా రికార్డు చేశారు. జిల్లాలో సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసే వెండర్స్ 41 మంది డిస్కం వద్ద అనుమతులు తీసుకున్నారు.

ముమ్మరంగా అవగాహన



సౌరవిద్యుత్ మీద వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం. కరపత్రాల ద్వారా ఇంటింటికీ ప్రచారం చేస్తున్నాం. వినియోగించుకున్న యూనిట్లకు మిగులు ఉంటే విద్యుత్‌ను గ్రిడ్‌కు అమ్ముకోవచ్చు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులపై భారం పడకుండా వీటిని ఏర్పాటు చేసే అవకాశాలపై పరిశీలిస్తున్నాం. జనవరి నుంచి అర్హత ఉన్న వారికి రిజిస్ట్రేషన్ చేస్తాం. జూన్‌లోపు 1.45 లక్షల మంది వినియోగదారులకు రిజిస్ట్రేషన్ పూర్తిచేస్తాం.

– సురేంద్రనాయుడు, ఎస్ఈ, ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్

హాయ్‌వే!

- 71 జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు గ్రీన్ సిగ్నల్
- తిరుపతి నుంచి నాయుడుపేట వరకు ఆరు లేన్ల బైపాను రోడ్డు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు


నాయుడుపేట సమీపంలో ఆధునిక ప్రమాణాలతో జాతీయ రహదారిపై రింగ్ రోడ్డు

నాయుడుపేట టౌన్: మూడేళ్ల కిందటి వరకు వాహనాల రద్దీ.. ట్రాఫిక్.. నిత్యం ప్రమాదాలకు నిలయమైన రేణిగుంట-నాయుడుపేట రోడ్డు అంతర్జాతీయ ప్రమాణాలతో ఆరు లేన్ల జాతీయ రహదారిగా రూపుదిద్దుకుంది. ఈ ఆరు లేన్ల జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ పడింది. మొదటగా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు 71 నంబరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకల ట్రయల్ రన్ ప్రారంభించి పరిశీలిస్తున్నారు. రేణిగుంట నుంచి నాయుడుపేట వరకు 58 కి.మీ వరకు ఆరు లేన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులకు రూ.2,238 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులు 2022 జనవరి 31 తేదీన ప్రారంభించారు. ప్రస్తుతం దాదాపు 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. రహదారి నిర్మాణ పనులను మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ చేపట్టింది. స్వర్ణముఖి నదిపై 6 లేన్ల బ్రిడ్జి నిర్మాణ పనులు చాలా వరకు పూర్తి కావస్తున్నాయి. నాయుడుపేట సమీపంలో అధునాతన ప్రమాణాలకు రింగ్ రోడ్డు పనులు పూర్తిచేశారు. రహదారికి ఇరువైపుల రింగ్‌బండ్‌లు ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా అనేక గ్రామాలను అనుసంధానం చేస్తూ సబ్‌వేలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణ పనులు పూకావచ్చాయి. జాతీయ రహదారిపై గేదెలు రాకుండా ఫెన్సింగ్‌లు సైతం వేస్తున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారి మధ్యలో పచ్చదనానికి ప్రాధాన్యమిస్తున్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు ఈ రహదారి అనుసంధనంగా ఉంటుంది. కృష్ణపట్నం పోర్టుకు సైతం అనుసంధనం చేశారు. ఈ రహదారి పనులు పూర్తి కావడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి సంబంధించి టోల్‌ప్లాజాను రేణిగుంట సమీపంలో మేర్లపాక వద్ద టోల్ ఫీజులను వసూలు చేయనున్నారు.

రహదారి సమాచారం

నిధులు 2,238కోట్లు	ఫ్లైఓవర్ బ్రిడ్జిలు 6
బాక్స్‌టైప్ కల్వర్టు బ్రిడ్జిలు 170	మైనర్ బ్రిడ్జిలు 10
మేజర్ బ్రిడ్జిలు 5	అండర్ పాస్ బ్రిడ్జిలు 19
నాయుడుపేట వద్ద రింగ్ రోడ్డు	

గతంలో నరకం

నాయుడుపేట నుంచి తిరుపతికు వేళ్లేందుకు గతంలో డబుల్ రోడ్డు ఉండేది. తిరుమలతో పాటు శ్రీకాళహస్తి, కాణిపాకం, రేణిగుంట విమానాశ్రయం, బెంగళూరుకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉండేది. అన్నీ వాహనాలు ఒక వైపే రాకపోకలు సాగించేవి. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకునేవి. పలువురు మృత్యువాత పడేవారు. రాష్ట్రంలోనే ప్రమాదాల్లో ఈ రహదారి 5వ స్థానంలో ఉండేది. ప్రస్తుతం ఈ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా మార్చడంతో ప్రయాణికులు సంబరపడుతున్నారు.


వాహనాల రాకపోకలకు సిద్ధమైన 71వ నంబరు జాతీయ రహదారి


నాయుడుపేట సమీపంలో పూర్తయిన జాతీయ రహదారి


నాయుడుపేట వద్ద పూర్తయిన బ్రిడ్జి



నారావారిపల్లి అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక


మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న

శ్రీకాళహస్తి: నారావారిపల్లె అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలనా భవనంలో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్‌తో కలిసి నారావారిపల్లి అభివృద్ధి, శెట్టిపల్లి భూములు, జాతీయ రహదారుల భూసేకరణ, నిర్మాణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారావారిపల్లిలో కమ్యూనిటీ అసెట్స్ సర్వే చేపట్టాలన్నారు. జీరో బేస్డ్ బడ్జెట్ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. అటానమస్ డ్రోన్లను జిల్లాలో కనీసం రెండు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు, కనెక్టివిటీ అంశాల అవసరమైన మేరకు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. గ్రామంలో ప్రతి కుటుంబానికీ అసెట్ ప్రొఫైల్, ఫ్యామిలీ ప్రొఫైల్ తయారు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ నారావాపల్లిలో విద్యా సంబంధిత అంశాల అభివృద్ధికి పాఠశాలల్లో డిజిల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. శ్రీసిటీ రూ.80లక్షల నిధులను సీఎస్‌ఆర్ కింద ఇవ్వడానికి అంగీకరించినట్టు వెల్లడించారు.

పోక్సో కేసులో ఆరుగురికి పదేళ్ల జైలు

సూళ్లూరుపేట: పట్టణంలోని సాయినగర్‌లో 2014లో నమోదైన పోక్సో కేసులో ఆరుగురు నిందితులకు పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ తీర్పునిచ్చినట్టు స్థానిక సీఐ మురళీకృష్ణ తెలిపారు. మహిళలు, చిన్నారులపై అత్యాచారం, వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు కూడా హెచ్చరించారని ఆయన తెలిపారు. ఈ కేసులో ఏ1 నిందితుడైన మల్లపు భాస్కర్ (23) మైనర్ బాలికను మోసపూరిత మాటలతో ప్రలోభపెట్టి ఆమెను కిడ్నాప్ చేసి హైదరాబాద్ తీసుకెళ్లాడని సీఐ పేర్కొన్నారు. ఆపై బాధితురాలిపై లైంగికంగా దాడిచేశాడన్నారు. ఇతనికి సహకరించిన సూళ్లూరుపేటకు చెందిన మల్లపు వెంకటేశ్వర్లు (46), మల్లపు సుభాషిణి (40), అక్కరపాక స్వాతి (22), అక్కరపాక రమేష్ (29), నెల్లూరుకు చెందిన రేవూరు మాలకొండయ్య (40)కూ కూడా పదేళ్లు జైలుశిక్ష, రూ.20 వేలు జరిమానా విధించినట్టు తెలిపారు.

దేశ సేవకు వేళాయెె!

- సైనిక్ స్కూల్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశాలు
- నోటిఫికేషన్ విడుదల

తిరుపతి ఎడ్యుకేషన్: దేశభక్తిని చాటుకోవాలనే తపన ఉన్న విద్యార్థులకు సైనిక్ పాఠశాలలు చక్కని అవకాశం కల్పిస్తున్నాయి. సైనిక్ పాఠశాలల్లో 2025-26లో 6, 9 తరగతుల్లో ప్రవేశం పొందేందుకు మంగళవారం నోటిఫికేషన్ విడుదలైంది. దేశ రక్షణలో భాగంగా త్రివిధ దళాలకు అవసరమైన సైనిక అధికారులను తయారు చేయాలన్న లక్ష్యంతో దేశ వ్యాప్తంగా సైనిక్ పాఠశాలలను ప్రారంభించారు. సైనిక్ పాఠశాలల్లో ఆరు, తొమ్మిదో తరగతికి బాలబాలికలు ప్రవేశం పొందవచ్చు. ఇందులో సీటు పొందడానికి సైనిక పాఠశాల నిర్వహించే ప్రవేశ పరీక్ష, వైద్య పరీక్షల్లో నెగ్గాలి. ఇక్కడ ఇంటర్మీడియెట్ వరకు విద్యను కొనసాగించవచ్చు.



విద్యార్థుల కవాతు

నోటిఫికేషన్ విడుదల

సైనిక్ స్కూళ్లల్లో 6, 9వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి 24వ తేదీ సాయంత్రం నోటిఫికేషన్ విడుదలయ్యింది. విద్యార్థులు జనవరి 13వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ''హెచ్‌టీటీపీఎస్://ఈఎక్స్‌ఏఎంఎస్.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్/ఏఐఎస్‌ఎస్‌ఈఈ'' (https://exams. nta.ac.in/AISSEE)వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

సిలబస్..

ఆరో తరగతిలో ప్రవేశానికి 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో గణితం 150 మార్కులకు, జనరల్ నాలెడ్జ్ 50 మార్కులకు, భాషా సామర్థ్యం 50, జనరల్ ఇంటిలిజెన్స్ 50మార్కులకు పరీక్ష ఉంటుంది. విద్యార్థులు ప్రతి విభాగంలో కనీసం 25 శాతం మార్కులు సాధించాలి. అన్ని సబ్జెక్టులు కలిపి 40శాతం మార్కులు రావాలి.

ఇక తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి 400మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో గణితం 200మార్కులకు, సామాన్యశాస్త్రం 50, ఆంగ్లంలో 50, సాంఘికశాస్త్రం 50, జనరల్ ఇంటెలిజెన్స్ 50మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రతి విభాగంలో కనీసం 25శాతం మార్కులు తప్పనిసరిగా సాధించాలి. అన్ని సబ్జెక్టులు కలిపి 40శాతం మార్కులు రావాలి.

సౌకర్యాలు

ఆరు నుంచి ఇంటర్ వరకు విద్య, వసతితో పాటు ఎన్‌సీసీ, యోగ, చిత్రలేఖనం, సంగీతం, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, స్విమ్మింగ్, గుర్రపు స్వారీ ఇతరత్రా సహ పాఠ్య కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 50శాతం విద్యార్థులకు రక్షణ శాఖ నుంచి ఉపకార వేతనం అందుతుంది. ఆర్థికంగా వెనుకబడ్డ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉపకార వేతనాన్ని పొందవచ్చు. సైనిక్ పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ పూర్తయిన తరువాత నేషనల్ డిఫెన్స్ అకాడమీ పరీక్ష (ఎన్‌డీఏ) నిర్వహించే అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే పూణేలో రెండేళ్లు శిక్షణ ఇస్తారు. ప్రతిభ ఆధారంగా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో అధికారులుగా నియమిస్తారు.

పరీక్షా విధానం

సైనిక్ ప్రవేశ పరీక్ష పూర్తిగా రాత విధానంలో ఉంటుంది. ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు రెండున్నర గంటలు, తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్షకు 3గంటల పరీక్ష సమయం ఇస్తారు. ఆరో తరగతి పరీక్ష గుర్తింపు పొందిన అన్ని ప్రాంతీయ భాషల్లో, తొమ్మిదో తరగతికి ఆంగ్లంలో ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు.

ఫీజు వివరాలు

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు జనరల్, ఓబీసీ(ఎన్‌సీఎల్),డిఫెన్స్, ఎక్స్ సర్వీస్‌మెన్ రూ.800, ఎస్సీ, ఎస్టీలు రూ.650చెల్లించాలి. దేశ వ్యాప్తంగా 190 నగరాల్లో ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. ప్రవేశ పరీక్ష తేదీని త్వరలో ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో ప్రకటించనున్నారు.

రిజర్వేషన్లు

ఆరు, తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, రక్షణ శాఖలో పనిచేస్తున్న, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు 25శాతం సీట్లు కేటాయిస్తారు. ఆరో తరగతికి 80 సీట్లు, తొమ్మిదో తరగతికి 20 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేస్తారు.

ఎవరు అర్హులంటే

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే బాలబాలికల వయస్సు 31 మార్చి 2025కి 10 నుంచి 12 ఏళ్లలోపు ఉండాలి. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే బాలురు వయస్సు మార్చి 31, 2025కి 13 నుంచి 15 ఏళ్లలోపు ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతుండాలి.

ఉజ్వల భవిష్యత్తు



దేశ వ్యాప్తంగా 33 సైనిక పాఠశాలలు భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ ఆధీనంలో పనిచేస్తాయి. ఈ పాఠశాలల్లో ఏటా ప్రవేశ పరీక్ష ద్వారా బాలబాలికలకు 6, 9 తరగతిలో ప్రవేశాలు కల్పిస్తాయి. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి మంగళవారం నోటిఫికేషన్ విడుదలైంది. సైనిక్ స్కూల్‌కు సంబంధించి పూర్తి వివరాలకు తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల కేంద్రాన్ని నేరుగాను, 86888 88802 నంబరులోను సంప్రదించవచ్చు.

– ఎన్.విశ్వచందన్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్, విశ్వం విద్యాసంస్థలు, తిరుపతి

ఇసుకపై ఉత్తుత్తి మాటలేనా?

- 39 రోజుల తర్వాత అదే గణాంకాలు
- నవంబర్ 15 సమావేశంలో ఇచ్చిన లెక్కలే డిసెంబర్ 24న కూడా
- నాలుగు నెలలుగా ప్రభుత్వ ఉచిత ఇసుక శూన్యం

తిరుపతి అర్బన్: ఉచిత ఇసుకపై జిల్లా అధికారులు ఉత్తుత్తి మాటలే చెబుతున్నారన్న విమర్శలు లబ్ధిదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఉచిత ఇసుక ప్రక్రియను నిలుపుదల చేసి నాలుగు నెలలు గడుస్తోంది. ఈ ఏడాది జూలై 8వ తేదీన ఉచిత ఇసుక పాలసీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తాపై ఆగస్టు వరకు తూతూమంత్రంగా ఇసుక పాలసీని కొనసాగించారు. తర్వాత ఇసుక లేదని సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు ఈ ప్రక్రియను నిలుపుదల చేశారు. ఉచితం అంటూనే.. వెంకటగిరి పరిధిలోని మొగళ్లగుంటలో టన్ను రూ.590కి, సూళ్లూరుపేట పరిధిలోని మావిళ్లపాడులో టన్ను రూ.465కి, సత్యవేడు పరిధిలోని పిచ్చాటూరులో టన్ను రూ.200కి, నాగలాపురంలో టన్ను రూ.200కు 50 రోజుల పాటు అరకొరగా అందుబాటులో ఉంచారు. ఆ తర్వాత ప్రభుత్వ ఉచిత ఇసుక మాటేలేదు.

నాడు ఏడు పాయింట్లలో ఉచిత ఇసుక



నవంబర్ 15న జరిగిన సమావేశంలో అధికారులు

గత నవంబర్ 15వ తేదీ శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులు ఉచిత ఇసుకపై సమావేశం నిర్వహించారు. జూలై 8 ఏర్పాటు చేసిన నాలుగు పాయింట్లలో ఇసుక లేకపోవడంతో.. నవంబర్ 30 నుంచి జిల్లాలో అదనంగా మూడు పాయింట్లు అందుబాటులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో కోట మండలంలోని గూడలి గ్రామం సమీపంలో స్వర్ణముఖి బ్యారేజీ వద్ద ఒక పాయింట్, పెళ్లకూరు మండలం, పాలచూరు, పుల్లూరు గ్రామాల వద్ద రెండు ఇసుక పాయింట్లు అందుబాటులోకి తీసుకొస్తామని మాటిచ్చి చేతులు పైకెత్తేశారు.

నేడు అవే మాటలు



డిసెంబర్ 24న జరిగిన సమావేశంలోనూ అవే హామీలు

కలెక్టరేట్‌లో అదే అధికారులు మంగళవారం సమావేశమయ్యారు. ప్రభుత్వ ఇసుక పాలసీలో భాగంగా జనవరి మొదటి వారం నుంచి ఉచిత ఇసుక పాలసీలో భాగంగా మూడు పాయింట్లు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. ఈ మూడు ఇసుక స్టాక్ పాయింట్ల ద్వారా 1,37,686 మెట్రిక్ టన్నులు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. ఈ సారైనా మాట నిలుపుకుంటారో లేదో వేచి చూడాల్సి ఉంది.

దూసుకొచ్చిన మృత్యువు

- అంతిమయాత్రకు వెళ్తుండగా ప్రమాదం
- ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

రేణిగుంట: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి అంతిమయాత్ర కోసం సన్నాహాలు చేస్తున్న జనం పైకి కారు అదుపుతప్పి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఏర్పేడు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏర్పేడు సీఐ కథనం .. ఏర్పేడు -వెంకటగిరి మార్గంలో సోమవారం బొలెరో వాహనం ఢీకొని దుర్గపేరి గ్రామానికి చెందిన గాది వెంకటేష్ మృతి చెందాడు. ఆయన మృతదేహానికి మంగళవారం మధ్యాహ్నం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే సమయంలో వెంకటగిరి వైపు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాలు, ఆటోలను ఢీకొంది. అక్కడే గుంపుగా ఉన్న జనాల పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మండలంలోని కృష్ణంపల్లికి చెందిన గెరటారెడ్డి(50), దుర్గపేరికి చెందిన గాది శ్రీనివాసులురెడ్డి(33), అదే గ్రామానికి చెందిన ఏ.కొండారెడ్డి (57)కి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో తిరుపతి రూయకు తరలించారు. ఆపై కొండారెడ్డిని స్విమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు రోజుల వ్యవధిలోనే మృతిచెందడంతో స్థానికులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదానికి కారణమైన కారు నడిపే శ్రీమౌళి తన భార్యను వెంకటగిరి నుంచి స్విమ్స్ ఆస్పత్రికి డయాలసిస్ కోసం తీసుకెళుతుండగా అదుపు తప్పి జనంపైకి వెళ్లింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో దూసుకెళ్లిన కారు

యూటీఎఫ్ నూతన కార్యవర్గం



జీజే.రాజశేఖర్, అధ్యక్షులు



కే.ముత్యాలరెడ్డి, ప్రధాన కార్యదర్శి



బి.మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఐక్య ఉపాధ్యాయ వేదిక(యూటీఎఫ్) తిరుపతి జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటైంది. తిరుపతిలోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన తిరుపతి జిల్లా కౌన్సిల్ సమావేశాల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శులు బత్తల లక్ష్మీరాజ, ఎస్ఎస్.నాయుడు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో తిరుపతి జిల్లా అధ్యక్షులుగా జీజే.రాజశేఖర్ (దొరవారి సత్రం), ప్రధాన కార్యదర్శిగా కే.ముత్యాలరెడ్డి(రేణిగుంట), గౌరవాధ్యక్షులుగా దండు రామచంద్రయ్య, సహాధ్యక్షులుగా ఎం.కుమారస్వామి(వెంకటగిరి), ఈ.గీతమ్మ(పుత్తూరు), కోశాధికారిగా కే.మోహన్ బాబు(శ్రీకాళహస్తి), జిల్లా కార్యదర్శులుగా బండి మధుసూదన్‌రెడ్డి (తిరుపతి), ఎన్.శేఖర్(వడమాలపేట), కే.ప్రభాకర్, కేఎంఎస్.సునీల (సూళ్లూరుపేట), జీ.సుధీర్(గూడూరు), ఐ.మస్తానయ్య (వాకాడు), ఏ.హరిబాబు (ఓజిలి), సీ.సురేష్(తిరుపతి), ఓ.విజయకుమార్, వై.విజయశ్రీ (తొట్టంబేడు), సీ.వెంకటకృష్ణ (బుచ్చినాయుడుకండ్రిగ), కే.ఆదినారాయణ (వెంకటగిరి), టీ.గోవర్ధనరెడ్డి (నాయుడుపేట) ఏ.హేమాంబరధరరావు (కేవీబీ.పురం)లు ఎన్నికయ్యారు. వీరితో పాటు రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

మైకా కార్మికుల ఆకలి కేకలు

- వేమిరెడ్డి వల్లే ఏడు నెలలుగా మూతపడ్డ గనులు
- ఈఎంఐలు కూడా కట్టుకోలేని దుస్థితిలో యజమానులు
- రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ పొట్టేళ్ల శిరీషా యాదవ్

సైదాపురం: మైకా గనుల మూతతో వేలాది మంది కార్మికులు ఆకలి కేకలతో అలమటిస్తున్నారని మాజీ రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ చైర్‌పర్సన్ పొట్టేళ్ల శిరీషా యాదవ్ ఆరోపించారు. మండలంలోని తురిమెర్ల గ్రామంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. సైదాపురం మండలంలో ఉన్న గనులన్నీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వల్లే గత ఏడు నెలలుగా మూతపడ్డాయని ఆమె తెలిపారు. గనులన్నీ మూతపడడంతో వాటికి అనుబంధంగా ఉన్న ట్రాక్టర్లు, జేసీబీలు మూలపడిపోయాయన్నారు. కనీసం ఈఎంఐలు కూడా కట్టుకోలేని దుస్థితిలో యజమానులు ఉన్నారని ఆమె పేర్కొన్నారు. పండుగ రోజుల్లో కూడా తమ ప్రాంతంలో ఉన్న గని కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. గతంలో ఎవరైతే సైదాపురం మండలంలో క్వార్ట్జ్ ఖనిజాన్ని దోచుకున్నవారికే మళ్లీ మైనింగ్ పరిశ్రమలను అప్పగించేలా ఎంపీ పావులు కదుపుతున్నారన్నారు. వారే అతిపెద్ద కార్యాలయాన్ని కూడా నిర్మిస్తున్నారని తెలిపారు. ఇకనైనా స్పందించి మైనింగ్ పరిశ్రమను సరైనవారికి అప్పగించి కార్మికులను కాపాడాలని వైఎస్‌ఆర్ సీపీ తరఫున తాను ప్రాథేయపడుతున్నానని ఆమె పేర్కొన్నారు.



ఎంపీ అనుచరుడి ఆఫీసు ఫొటోలను చూపుతున్న శిరీషా

ముగిసిన ఉద్యోగోన్నతులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని కార్పొరేషన్, మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన ఉద్యోగోన్నతుల ప్రక్రియ ముగిసింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిత్తూరు డీఈఓ కార్యాలయంలో ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించారు. సాయంత్రం కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టి రాత్రి 7 గంటలకు పూర్తి చేశారు. ఈ ప్రక్రియను డీఈఓ వరలక్ష్మి పర్యవేక్షించారు. ఈ ఉద్యోగోన్నతుల ప్రక్రియలో అర్హులైన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 4, గణితం 1, ఫిజిక్స్ 1, బయాలజీ 8, సోషల్ 10, తమిళ మీడియం సోషల్ 1, తెలుగు మీడియం గణితం 1, తెలుగు మీడియం ఫిజిక్స్ 1 పోస్టులకు ఉద్యోగోన్నతులు కల్పించారు. అనంతరం ఉద్యోగోన్నతులు పొందిన టీచర్లకు డీఈఓ వరలక్ష్మి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ రామ్‌కుమార్, సత్య, సీనియర్ అసిస్టెంట్‌లు మురళి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



డీఈఓ చేతుల మీదుగా ఉద్యోగోన్నతి నియామకపత్రం అందుకుంటున్న ఉపాధ్యాయిని

సీసీ కెమెరాలతో భద్రత



మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: జిల్లాలో వాణిజ్య సముదాయాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. మంగళవారం రామతులసి కల్యాణ మండపంలో వ్యాపారులు, పోలీసుల మధ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొత్తకొత్త సాంకేతిక పరిజ్ఞానాలతో నేరాలు చేస్తున్నారని, వీటికి అడ్డుకట్టు వేయడానికి పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వాణిజ్య సముదాయాల వారు విధిగా షాప్‌ల ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఇన్‌స్టాల్ చేయడంపై ఏవైనా సమస్యలుంటే స్థానిక పోలీస్ స్టేషన్‌ని గానీ, పోలీస్ సమాచారం కోసం 112/80999 99977 సంప్రదించాలని ఎస్పీ సూచించారు. తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ, సీఐలు రామకిషోర్, రామకృష్ణ, ప్రెసిడెంట్ చాంబర్ ఆఫ్ కామర్స్ మోహన్‌రాజు, ఆర్ఎస్ రామిరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



సత్యవేడు: మండలంలోని పెద్ద ఈటిపాకం గ్రామ సమీపంలో మినీ టెంపోలో అక్రమంగా తరలిస్తున్న మూడున్నర టన్నుల రేషన్ బియ్యాన్ని శ్రీసిటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు సూచనల మేరకు సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్ఐ హరిప్రసాద్, పోలీసుల బృందంతో మంగళవారం తెల్లవారు జామున సత్యవేడు – పాండూరు మెయిన్ రోడ్డు పెద్ద ఈటిపాకం వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మినీ టెంపోను పరిశీలించగా 77 బస్తాల రేషన్ బియ్యం బయటపడింది.

ఖాళీ సర్వీసులపై దృష్టి



మాట్లాడుతున్న డీపీటీఓ జగదీష్

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాలో ఖాళీ సర్వీసులపై దృష్టి పెట్టాలని, ఆర్టీసీ ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీవో) జగదీష్ సూచించారు. మంగళవారం తిరుపతిలోని ఆయన చాంబర్‌లో ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఏయే ఆలయాలకు ఎన్ని సర్వీసులు ఏర్పాటు చేయాలనే అంశాలపై చర్చించారు. మరోవైపు బస్టాండ్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. పత్రికల్లో వస్తున్న కథనాలు, ప్రయాణికులు ఇస్తున్న ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తే.. జిల్లా నుంచి ఎన్ని సర్వీసులను అందించడానికి సిద్ధంగా ఉన్నామనే అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం, జిల్లా పర్సనల్ ఆఫీసర్(పీవో) సహజాద్, తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ, తిరుపతి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డీఆర్ నాయుడు, అకౌంట్స్ అధికారి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రూ.20 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం

తిరుపతి మంగళం : తిరుపతి జిల్లా నాగలాపురం మండలం రేప్పాల తిప్ప సమీపంలోని అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.20 లక్షల విలువ చేసే ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమచారం మేరకు అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. అక్రమ రవాణా చేయడానికి ఎర్రచందనం దుంగలు సిద్ధం చేస్తున్న కేవీబీపురానికి చెందిన సురేంద్ర, నాగలాపురానికి చెందిన మునివేలు, తమిళనాడు సేలం జిల్లాకు చెందిన మేస్త్రి సెల్వరాజితోరై స్వామితో పాటు మరో ఐదుగురు తమిళ కూలీలను అరెస్ట్ చేశారు. పట్టుబడిన ఎర్రచందనం విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు తెలిపారు.



ఎర్రచందనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 28 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,656 మంది స్వామివారిని దర్శించుకోగా 24,360 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.15 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.